# తాతయ్య మనసు

కథ

- కొమ్మూరి రవికిరణ్



ఫోన్ మ్రోగింది.
రిసీవర్ చేతుల్లోకి తీసుకుని, ''యా?'' అన్నాడు రామారావు.
''బాబూ!... నేను... ఇండియా నుంచి మాధవయ్యను మాట్లాడుతున్నాను.''
మాధవయ్య గొంతు వినగానే అయిష్టంగా ముఖం పెట్టి, ''చెప్పండి?'' అన్నాడు విసుగ్గా రామారావు.

అతని విసుగుని పట్టించుకోనట్టుగా, ''కార్యక్రమాలన్నీ అయిపోయాయి నువ్వు చెప్పినట్టుగానే అన్నీ చేశాను. మీ నాన్న కృష్ణమూర్తి, నేను చిన్నప్పట్నుంచీ ప్రాణ స్నేహితులం. ఒక్క రోజు కూడా కలవకుండా వుండలేదు. ఇప్పుడు... ఇప్పుడు వాడికి స్వయంగా నేనే యీ దహన సంస్కారాలన్నీ చేస్తాననుకోలేదు. చాలా బాధగా వుంది బాబు,'' గద్గదికమైంది మాధవయ్య గొంతు.

చిరాకేసింది రామారావుకి. కొంచెం తమాయించుకుని, ''ఎవరు చేస్తే ఏం లెండి'' అన్నాడు నిర్లక్ష్యంగా.

రామారావు ధోరణికి తెల్లబోయాడు మాధవయ్య. కోపం వచ్చింది, ''నీ చిన్నతనంలో నువ్వు ఎక్కువగా నా దగ్గరే వుండేవాడివి. ఆ చనువు కొద్దీ అంటున్నాను. ఇలాంటప్పుడు నువ్వలా మాట్లాడ్డం పద్ధతిగా లేదు. కొడుకు, కోడలు వుండి కూడా వాడు అనాథలా వెళ్ళిపోయాడు.''

రామారావుకి అసహనం పెరిగిపోయింది, ''ప్లీజ్ మాధవయ్యగారు. ఇప్పుడు దేనికి ఫోన్ చేశారో చెప్పండి...''

రామారావు ఎదురుగా వుంటే చాచి కొడదామన్నంత కసిగా వుంది మాధవయ్యకి. అతనికి తండ్రి కొడుకుల మధ్య దూరం గురించి తెలుసు. కృష్ణమూర్తి గుర్తొచ్చాడు. సర్దుకుని అన్నాడు, ''నువ్వొకసారి ఇండియాకి రావాల్సివుంటుంది.''

''వ్వాట్?!'' అరిచాడు, ''ఏం మాట్లాడుతున్నారు మీరు. ఆయన పోయారంటేనే రాలేదు. ఇప్పుడెందుకు? అన్నీ అయిపోయాయిగా?''

''అయిపోలేదు,'' ముక్తసరిగా అన్నాడు మాధవయ్య.

''ఏం?''

''కృష్ణమూర్తి పుట్టి పెరిగిన యీ వూళ్ళో ఆ యిల్లు అలాగే వుంది. అది వాడి తర్వాత మీకే వస్తుంది.''

''ఇల్లా.... నేనేం చేసుకోను దాన్ని?'' హేళనగా అడిగాడు రామారావు.

''మీ యిష్టం. ఏమైనా చేసుకోండి.''

''మీరే వుంచుకోండి. అమ్మితే ఎంతొస్తుంది? లక్షా, రెండు లక్షలా?'' వెటకారంగా అడిగాడు.

''రెండు కోట్లు''

మాధవయ్య చెప్పింది విని అదిరిపోయాడు రామారావు. ''మైగాడ్!'' అని గొణిగాడు.

''చెప్పు, ఎప్పుడు వస్తావు?''

వెంటనే మాట్లాడలేకపోయాడు. మెల్లగా తేరుకుని హీనమైన కంఠంతో అన్నాడు, ''వీలు చూసుకుని వస్తాను.''

''వచ్చేటప్పుడు నీ కొడుకుని కూడా తీసుకురా,'' అన్నాడు మాధవయ్య.

విస్మయంగా ''వాడెందుకు?'' అనడిగాడు.

''మీ నాన్న వీలునామా ఏమీ వ్రాయలేదు. నువ్వు ఆ యింటికి ఏమైనా చెయ్యాలన్నా, అమ్మాలన్నా నీ కొడుకు సంతకం కూడా వుండాలి. అందుకు.''

* * *

కసిగా ఫోన్ పెట్టేశాడు రామారావు.

''అయితే మీరు ఇండియాకి వెళ్తున్నారన్నమాట'' అక్కసుగా అంది జయ.

''అంతా విన్నావా?''

''ఆ మాధవయ్య మాటలు వినలేదు. ముందిది చెప్పండి? వెళ్ళడానికే నిర్ణయించుకున్నారా?''

''ఇప్పటి దాకా నేనూ వెళ్ళకూడదనుకున్నాను. కాని వెళ్లాలి తప్పదు,'' స్పష్టంగా అన్నాడు.

''ఎందుకు? వెళ్ళొద్దని నేను చెబుతున్నాను'' శాసిస్తున్నట్టుగా అంది.

''కాని... ఆ యిల్లు...?''

''ఎవడిక్కావాలండి ఆ బోడి యిల్లు? ఎవరికైనా ముష్టి వెయ్యమనండి,'' యీసడింపుగా అంది.

''రెండు కోట్లు ముష్టి వెయ్యమంటావా?'' తాపీగా అడిగాడు.

నోట మాట రాలేదు జయకి.

''చెప్పు?'' రెట్టించాడు.

పాలిపోయిన ముఖంతో బింకంగా అంది జయ, ''అయితే మాత్రం మీరు వెళ్ళడం దేనికి. ఏదో ఒకటి సెటిల్ చెయ్యమని మాధవయ్యకి చెప్పండి?''

''సెటిల్ చెయ్యడానికే... నేనే కాదు అభిని కూడా తీసుకెళ్ళాలి.''

వీళ్ళిద్దరి సంభాషణ కొంచెం దూరంలో సోఫాలో కూర్చుని వింటున్నాడు రామారావు కొడుకు అభిరాం. అతనికి ఇరవై ఏళ్ళుంటాయి.

కొడుకు వైపు చూసి ''వాడెందుకు?'' అడిగింది జయ.

వీలునామా గురించి మాధవయ్య చెప్పిన విషయం చెప్పాడు.

అంతా విని, ''ఎలాగైనా యిండియాకి రప్పించాలని యిలా చేశాడు; చచ్చి సాధిస్తున్నాడు ముసలివాడు,'' కచ్చగా అంది జయ.

''ఇప్పుడేం చెయ్యమంటావు?'' సందిగ్ధంగా అడిగాడు రామారావు.

''మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి. నేను మాత్రం రాను,'' రోషంగా అనేసి లోపలికి వెళ్ళిపోయింది జయ.

రామారావు ఒక్క నిమిషం మౌనంగా వుండి, కొడుకు దగ్గరకు వచ్చి అడిగాడు, ''ఇండియాకి వెళ్దామా అభీ?''

''ఇండియాలో ఎవరున్నారు డాడీ?''

''...తాతయ్య వుండేవారు... ఇప్పుడు లేరు.''

''తాతయ్యంటే మమ్మీ వాళ్ళ డాడీ కదా?''

తడబడ్డాడు రామారావు, ''తాతయ్యంటే... తాతయ్యంటే మా నాన్న,'' మొదటిసారిగా తండ్రి గురించి కొడుక్కి చెప్పాడు.

* * *

ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాగానే టాక్సీలో స్వంత వూరికి బయల్దేరాడు అభిరాంతో సహా.

కార్లో రామారావు, అభిరాం యిద్దరూ నిద్రపోయారు. నాలుగు గంటలు ప్రయాణం చేసిన తర్వాత, ''వూళ్ళోకి వచ్చాం సార్'' అన్న డ్రైవర్ మాటలకు మెలకువ వచ్చి చూసాడు రామారావు.

దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత స్వంత గడ్డపై అడుగు పెట్టాడు. తెలియని అనిర్వచనీయమైన భావంతో ముందుకు వంగాడు.

అభిరాం కూడా నిద్ర లేచాడు.

''ఎక్కడికి వెళ్ళాలి సార్?'' డ్రయివర్ అడిగాడు.

అడ్రస్ చెప్పి, బయటకు చూసి ఆశ్చర్యపోయాడు రామారావు. తన వూరేనా యిది!

కారు రెండు మూడు మలుపులు తిరిగింది.

ఇవన్నీ తన బాల్యంలో స్నేహితులతో తిరిగిన వీధులు. ఇపుడంతా గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. ఎత్తు భవనాలతో, కమర్షియల్ కాంప్లెక్సులతో కళకళలాడుతున్నాయి వీధులన్నీ. నమ్మలేనట్లుగా చూస్తున్నాడు. అభిరాం కూడా కుతూహలంగా తిలకిస్తున్నాడు.

కారు ఇంటి ముందు ఆగింది.

కారుని చూసి లోపల్నుంచి బయటకు వచ్చాడు మాధవయ్య.

టాక్సీలోంచి దిగి ఇంటిని ఆసక్తిగా చూడసాగాడు అభిరాం.

సూట్‌కేసులు దింపి టాక్సీని పంపించేసి మాధవయ్యను చూసి, ''నా కొడుకు అభిరాం'' పరిచయం చేసాడు.

''నమస్కారం తాతయ్యగారు'' అన్నాడు అభిరాం చేతులెత్తి.

ముచ్చటేసింది మాధవయ్యకి. అభిరాంను దగ్గరకు తీసుకుని ''చిరంజీవ'' అన్నాడు.

''ఏదైనా హోటల్ రూం బుక్ చెయ్యబోయారా?'' కొంచెం విసుగుతో అన్నాడు రామారావు.

''కాని నువ్వు చెయ్యవల్సిన కార్యక్రమాలన్నీ యిక్కడే వున్నాయి,'' గంభీరంగా అన్నాడు మాధవయ్య.

''మా ఆవిడ ఫోన్ చేసిందిగా?''

తలూపాడు మాధవయ్య.

ఇంట్లోకి అడుగు పెట్టింతర్వాత, ''అభి యిక్కడంతా నువ్వు అడ్జస్ట్ అవ్వాలి,'' అన్నాడు రామారావు.

అభిరాం భుజాలెగరేసాడు.

మాధవయ్యతో అన్నాడు, ''మేం బాగా అలిసిపోయాం. రెస్ట్ తీసుకోవాలి. మేం ఎక్కువ రోజులు వుండం. సాయంత్రం లాయర్‌గారిని పిలిపించండి మాట్లాడాలి,'' అని లోపలికి వెళ్ళాడు.

అభిరాం మాత్రం హాల్లోనే నిలబడి చూస్తున్నాడు.

మాధవయ్య అభిరాం మీద చెయ్యి వేసి, ''ఏమిటి బాబు చూస్తున్నావ్?'' అనడిగాడు.

''మా తాతయ్య డెడ్‌బాడీని ఎక్కడ పడుకోబెట్టారు తాతయ్యా?''

ఉలిక్కిపడ్డాడు మాధవయ్య. తర్వాత చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ చూపించాడు.

లోపల్నుంచి బయటకు వచ్చిన రామారావు కొడుకు ఏం చేస్తున్నాడా అని చూస్తున్నాడు.

మాధవయ్య చూపించిన ప్రదేశం దగ్గరకు వచ్చి వంగి దణ్ణం పెట్టాడు అభిరాం.

కొడుకునే గమనిస్తున్న రామారావు తల అప్రయత్నంగా వంగిపోయింది.

మాధవయ్య ''నీ మనవడ్ని చూస్తే చాలా సంతోషించేవాడివిరా కృష్ణా'' అని పైకే అన్నాడు.

* * *

సాయంత్రం లాయర్ వచ్చి చాలాసేపు కూర్చున్నాడు. అతను రామారావు స్నేహితుడే.

లాయర్ గారు వెళ్ళిన తర్వాత రామారావు మాధవయ్యతో అన్నాడు.

''అన్నీ డాక్యుమెంట్లు కరెక్టుగానే వున్నాయి. ముందు అభి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయిద్దామనుకున్నాను. కాని మాకు యిక్కడ ఏం పని? అందుకే యింటిని అమ్మేద్దామనుకుంటున్నాను. లాయర్ గారే బ్రోకర్స్‌ని పిలిపిస్తానన్నాడు.''

మాధవయ్య నిర్లిప్తంగా విన్నాడు.

''ఇంకా నేను చెయ్యాల్సిన పనులున్నాయా?''

''వున్నాయి.''

''ఏంటవి?'' కళ్ళు పైకెత్తి అడిగాడు.

''మీ నాన్న అస్థికలు నదిలో కలపాలి. మూడు రోజుల్లో తిథుల ప్రకారం మొదటి మాసికం వస్తుంది. నిత్యకర్మలు ఎలాగూ నువ్వు చెయ్యలేదు. కనీసం ఈ కార్యక్రమమైనా నువ్వు చేస్తే, మీ నాన్న ఆత్మ తృప్తి పడుతుంది.''

కంపరంగా అన్నాడు రామారావు, ''ఇవన్నీ యిప్పుడు అవసరమంటారా? ఆయన బ్రతికి

వున్నప్పుడు లేని అటాచ్‌మెంట్స్ యిప్పుడు ఎందుకు?''

''అటాచ్‌మెంట్స్ కాదు కనీస ధర్మం. నువ్వు పంతాలు పడితే చూడ్డానికి మీ నాన్న యిక్కడ లేడు,'' కటువుగా అన్నాడు మాధవయ్య.

కాసేపు ఆలోచించి చెప్పాడు రామారావు, ''సరే... ఆ ఏర్పాట్లేవో మీరే చూడండి.''

స్థిమితపడ్డాడు మాధవయ్య.

* * *

రామారావు, అభిరాం వచ్చి రెండు రోజులయ్యింది. చిన్ననాటి స్నేహితులను కలవడానికి వెళ్ళాడు రామారావు.

అభిరాం నిద్రలేచి గదిలోంచి బయటకు వచ్చాడు. వచ్చి రెండు రోజులయినా ఇల్లు చూడ్డం కుదరలేదు.

అన్నీ గదులు తిరిగి చూశాడు. అతనికి యిల్లు నచ్చింది.

''ఏమిటి బాబు చూస్తున్నావు?'' అడిగాడు మాధవయ్య.

''ఇందులో మా తాతయ్య, బామ్మ వుండేవారంటే థ్రిల్లింగ్‌గా వుంది. ఇల్లు మోడర్న్‌గానే కట్టారు తాతయ్య.''

నవ్వాడు మాధవయ్య.

''ఇంట్లో చూద్దామన్నా తాతయ్యది, బామ్మది ఒక్క ఫోటో కూడా లేదేమిటి తాతయ్య'' ఆశ్చర్యంగా అడిగాడు.

సమాధానం చెప్పలేదు మాధవయ్య.

''చెప్పు తాతయ్యా? ఫోటో లేదా?''

''లేకేం బాబు. చాలా వున్నాయి. నువ్వు వచ్చేసరికి మీ తాతయ్యది, బామ్మది ఒక్క ఫోటో కూడా నీకు కనబడనివ్వద్దని మీ అమ్మగారి ఆజ్ఞ. ఆ షరతు మీదే నిన్ను యిక్కడకు పంపిస్తానన్నారు.''

కోపం వచ్చింది అభిరాంకి, ''నా తాతయ్య, నా బామ్మ. ఇందులో అమ్మకు సంబంధం లేదు.''

అబ్బురపడుతూ చూసాడు మాధవయ్య అభిరాంని.

''ప్లీజ్ తాతయ్యా! నాకు తాతయ్యని, బామ్మని చూడాలని వుంది,'' బ్రతిమాలుతున్నట్లుగా అడిగాడు.

''కాని... బాబూ...,'' సంకోచిస్తూ అన్నాడు.

''డాడీకి... ఈ విషయం చెప్పను. నీ మీద బ్లేమ్ రాదు. ప్లీజ్ తాతయ్య.''

పెద్దవాళ్ళని చూడాలన్న అభిరాం తాపత్రయానికి పొంగిపోయింది మాధవయ్య మనసు.

''నాతోరా...,'' అని చివరన కొంచెం విడిగా వున్న గదిలోకి తీసికెళ్ళాడు. ఉత్సాహంగా మాధవయ్యతో ఆ గదిలోకి అడుగు పెట్టాడు. లైటువేసి, మూలనున్న బల్లమీద వున్న ట్రంకు పెట్టెను తెరిచాడు. ఆతృతగా చూడసాగాడు అభిరాం.

లోపల్నించి ఫ్రేమ్ కట్టివున్న పెద్ద ఫోటోని బయటకు తీసి చూపించాడు మాధవయ్య.

ఫోటోని చేతుల్లోకి తీసుకుని కళ్ళు పెద్దవి చేసి తదేకంగా చూసాడు అభిరాం.

తాతయ్య, బామ్మల ఫోటో.

గుబురుగా వున్న మీసాలతో దర్పంగా వున్నాడు కృష్ణమూర్తి.

''వావ్!... కింగ్‌లకే కింగ్‌లా వున్నాడు తాతయ్య,'' ఎక్సయిటింగ్‌గా అన్నాడు.

గర్వంగా నవ్వాడు మాధవయ్య.

''బామ్మ కూడా చాలా అందంగా వుంది. ఐ థింక్... వీళ్ళది డెఫినెట్‌గా లవ్ మేరెజ్ అయ్యుంటుంది. కదూ తాతయ్యా?'' మాధవయ్యని చూస్తూ అడిగాడు.

ముసి ముసిగా నవ్వాడు మాధవయ్య. నవ్వి లోపల్నుంచి ఒక కవరు తీసాడు. అందులోంచి చాలా పాత బనియన్ ఒకటి బయటకు తీసాడు.

బనియన్ మీదంతా పెన్నుతో గీసిన పిచ్చి పిచ్చి మరకలే.

ఆసక్తిగా దాన్ని కూడా చేతుల్లోకి తీసుకుని, ''ఇదేంటి బనీను యింత డర్టీగా వుంది?'' అనడిగాడు.

మళ్ళీ నవ్వి అన్నాడు మాధవయ్య, ''అలా డర్టీ చేసింది నువ్వే.''

''నేనా...?!'' ఆశ్చర్యంగా అడిగాడు.

''నీకు తెలుసో తెలీదో, నీ చిన్నప్పుడు– అంటే నీకప్పుడు నాలుగేళ్ళు– నువ్వు మీ అమ్మా, నాన్నలతో ఇండియాకి వచ్చావు. అదే ఆఖరుసారి.''

''నేనొచ్చానా? నాకెప్పుడు డాడీ చెప్పలేదే?'' నివ్వెరబోతూ అన్నాడు.

''మీరందరూ వచ్చారు. అప్పుడు నువ్వు మీ తాతయ్య గుండెల మీద ఆడుకుంటూ పెన్నుతో యిలా గీసావు. ఎప్పుడూ నీట్‌గా వుండే మీ తాతయ్య, నీ అల్లరిని మాత్రం బాగా ఎంజాయ్ చేసేవాడు. అంత యిష్టం తాతయ్యకు నువ్వంటే....''

ఆప్యాయంగా, మంచి అనుభూతితో బనీను చూడసాగాడు.

''నువ్వు మళ్ళీ రాలేదుగా.... వుతికితే ఎక్కడ మరకలు పోతాయోనని యిలాగే వుంచేశాడు నీ గుర్తుగా. అప్పుడప్పుడు దీన్ని చూసుకుని మురిసిపోతుండేవాడు.''

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి అభిరాంకి. ఎంత మిస్సయ్యాడు యిన్నాళ్ళూ తాతయ్యని, బామ్మని?

''బాబు'' అన్నాడు మాధవయ్య అభిరాం భుజం మీద చెయ్యివేసి.

తేరుకుని అడిగాడు, ''అసలు మేం ఎందుకు యిన్నాళ్ళు దూరంగా వున్నాం తాతయ్యా?''

''మనస్పర్థలు వచ్చింది మీ బామ్మకి, మీ అమ్మగారికి. చాలా చిన్న గొడవ. తప్పెవరిదో కూడా తెలీదు. మీ బామ్మగారు తర్వాత ఏడాదే పోయారు. బహుశా గొడవ మీ అమ్మగారికి కూడా సరిగ్గా గుర్తువుండి వుండదు. కాని దూరం మాత్రం పెరిగిపోయింది.''

ఇంతలో అభిరాం దృష్టి ట్రంకు పెట్టెలోని పెద్ద ఆల్బమ్ మీద పడింది.

''ఇదేంటి?'' అనడిగాడు దాన్ని చేతుల్లోకి తీసుకుని.

''నువ్వే చూడు''

ఆల్బమ్ తెరిచి ఒక్కొక్కటి చూడసాగాడు. మొదటిగానే పెద్ద ఇంటి ఫోటో కనబడింది.

ముందు పెద్ద వరండా, సింహద్వారం పెద్ద గది తర్వాత మండువా లోగిలి, తర్వాత పెద్ద పెద్ద గదులు, వెనుక విశాలమైన పెరడు.

ఒక్కొక్క ఫోటో చూస్తుంటేనే యిల్లు ఎలా వుండేదో అర్థమైపోయింది.

''చాలా బావుంది తాతయ్యా. ఎవరిది ఇల్లు?''

''ఇంకెవరిది? మీదే. ఆ యిల్లంటే మీ తాతయ్యకు చాలా యిష్టం.''

''మరి యీ ఇల్లు?'' చుట్టూ చూస్తూ అడిగాడు.

''ఆ యింటిని పగులగొట్టి యిలా కట్టించాడు.''

''ఎందుకు?''

''అదీ... మీ అమ్మానాన్నల కోసమే. ఆ యిల్లు పాతగా వుందని, సౌకర్యంగా లేదని, అలా వుంటే అమెరికా నుండి రావడం కుదరదనీ వాళ్ళంటే, మీ తాతయ్య పాత యింటిని మార్చి యిలా కట్టించాడు. తర్వాత పాత యింటిని మర్చిపోలేక మీ తాతయ్య రెండు సంవత్సరాలు మనిషి కాలేదంటే నమ్ము....''

మాట్లాడలేకపోయాడు అభిరాం. ఆలోచిస్తూ వుండిపోయాడు.

* * *

అభిరాం, మాధవయ్య ఓ ప్రక్కగా కూర్చుని చూస్తున్నారు.

రామారావు తండ్రికి మాసికం పెడుతున్నాడు. అతని ముఖంలో బాధ్యత నెరవేర్చే ఉద్యోగిలా వుందికాని, అంకిత భావం లేదు.

అభిరాం తండ్రి చేస్తున్న కార్యక్రమం గురించి మాధవయ్యను అడిగి తెలుసుకుంటున్నాడు.

తతంగం పుర్తయిన తర్వాత బ్రాహ్మణుడు అన్నాడు, ''తండ్రిగారిని ఒకసారి స్మరించుకుని యీ పిండం తీసుకువెళ్ళి కాకికి పెట్టిరా నాయనా.''

రామారావు లేచి ఇంటి ప్రక్క గోడ మీద ముద్ద పెట్టి నమస్కరించి చూసాడు. ఒక్క కాకి కూడా రాలేదు.

లోపలికి వచ్చిన తర్వాత జరగాల్సినవి అన్నీ పూర్తి చేసాడు. భోక్తలికి, బ్రాహ్మణుడికి డబ్బులిచ్చి పంపించేసి లోపలికి వస్తూ గదిలో వినబడుతున్న మాటలకు ఆగిపోయాడు మాధవయ్య.

రామారావు అంటున్నాడు, ''అభి... అన్నీ సర్దేసుకో. రేప్రొద్దున్నే మనం బయల్దేరాలి.''

మాట్లాడలేదు అభిరాం.

''మళ్ళీ మనం త్వరలోనే రావాల్సి వస్తుంది. ఇంటిని సేల్‌కి పెట్టమని లాయరంకుల్‌కి చెప్పాను.''

''... ... ...''

''మాట్లాడవేం నాన్నా?''

''నేను అమెరికా రావట్లేదు డాడీ. ఇక్కడే వుంటాను,'' నెమ్మదిగా అన్నాడు.

షాక్ తగిలినట్లుగా చివ్వున తలెత్తి కొడుకు వైపు చూసాడు.

అభిరాం కళ్ళల్లో నీళ్ళు.

తమాయించుకుని, ''సిల్లీగా మాట్లాడకు... మళ్ళీ వస్తాంగా.''

''నేను నిజంగానే అంటున్నాను డాడీ.''

కోపం వచ్చింది రామారావుకి, ''ఆర్ యూ మాడ్! పిచ్చి పిచ్చి అటాచ్‌మెంట్స్ పెట్టుకోకు. ఇక్కడ ఎవ్వరూ లేరు.''

ఉద్రేకం తన్నుకు వచ్చింది అభిరాంకి, ''నో! ... అందరూ వున్నారు. వుండేవారు. నాకు తాతయ్య వున్నాడు. బామ్మ వుంది. ఇంకా చాలా మంది రిలెటివ్స్ వున్నారు. అందర్నీ మీరే నాకు కాకుండా చేసారు'' ఏడుపు గొంతుతో అన్నాడు.

''నేనా...!''

''అవును... మీరే... ఇన్నాళ్ళూ నాకో తాతయ్య వున్నాడని ఎందుకు చెప్పలేదు?''

కొడుకు ఆవేదనతో కూడిన ప్రశ్నకు తత్తరపడ్డాడు, ''అది... మీ... మమ్మీ.''

''నీకూ తాతయ్యకూ రిలేషన్స్ తెంపడానికి మధ్యలో మమ్మీ ఎవరు డాడీ?''

బుల్లెట్స్‌లా వరుసగా వస్తున్న ప్రశ్నలకు మాట పెగలలేదు రామారావుకి.

బుజ్జగించినట్లుగా అన్నాడు, ''నీకు తెలియదు అభీ. బామ్మకి, మమ్మీకి గొడవలయ్యాయి.''

''మీకూ మమ్మీకి చాలా సార్లు గొడవలయ్యాయి కదా; మరి మీరెందుకు విడిపోలేదు? మీకు మీకు మధ్యలో ఎన్నయినా వుండొచ్చు; కాని మా మధ్యలో రిలేషన్స్ పోగొట్టడానికి మీకేం రైట్ ఉంది?''

మరో బుల్లెట్ దిగింది రామారావుకి.

''నేనెప్పుడూ ఒంటరే. నా చిన్నతనంలో నన్ను ప్రి స్కూల్‌లో పడేసారు. తర్వాత ఫ్రెండ్స్ యిళ్ళల్లోనే నా జీవితం గడిచింది. ఏ రోజైనా నన్ను మీ ప్రక్కన పడుకోబెట్టుకున్నారా డాడీ? మమ్మీ కూడా అంతే... ఎప్పుడూ బిజినెస్ అని నన్ను పట్టించుకోలేదు. నన్ను మీరు ప్రేమించలేదు డాడీ; ప్రేమించాననుకున్నారు. కనీసం నన్ను ప్రేమించే వాళ్ళ దగ్గరకయినా పంపించాల్సింది. ''

కూడబలుక్కుంటూ అన్నాడు రామారావు, ''అక్కడ కల్చర్ అంతే... నీకు తెలీదా? ఏం చేసినా నీ కోసమే చేసాం....''

''నాకోసం చెయ్యలేదు డాడి. అందరికీ అందరూ ఉన్నారు. దూరంగా వున్నా ఎవ్వరిని ఎవ్వరూ పోగొట్టుకోలేదు. కనీస ప్రేమ, ఆపేక్ష నాకు లేకుండా చేసారు. నన్ను యీ విధంగా పెంచుదామని నిర్ణయించుకున్నపుడు, నన్ను కూడా దూరం చేసి తాతయ్య దగ్గరే వుంచాల్సింది. నాకిప్పుడు తాతయ్య కావాలి, బామ్మ కావాలి, అందరూ కలిసి వుండటం కావాలి. ఏదీ... తెచ్చివ్వండి....'' ఏడుస్తున్నాడు అభిరాం.

బయట నిలబడ్డ మాధవయ్యకు అభిరాంని చూస్తే జాలేసింది. లోపల రామారావుకి నరాలు వుండలు చుట్టుకుపోయినట్లుగా అయిపోయాడు. అతనిలో మెల్లగా దుఃఖం బయటకు రాసాగింది.

''ఒక్కసారి కూడా నన్ను యిండియాకి తీసుకు రావాలనిపించలేదా డాడీ? పాపం తాతయ్య... ఎంత బాధపడ్డారో... ఆయన అఖ్ఖర్లేదు కాని, తాతయ్య ఆస్తి కావాలి. అందుకే మీరూ నాకు అఖ్ఖర్లేదు.''

రామారావులో గూడు కట్టుకున్న ఆవేదన కన్నీళ్ళ తెరలు తెరలుగా బయటకు వచ్చింది.

వింటున్న మాధవయ్యకి అభిరాం ఎంతో ఎత్తులో కనబడ్డాడు.

కొన్ని ఏళ్ళ తరబడి గుండెల్లో దాచుకుని కుమిలిపోయిన కృష్ణమూర్తి ప్రశ్నలు, ఓ చిన్న కుర్రాడు వకాల్తా పుచ్చుకుని సూటిగా సంధిస్తున్నాడు.

రామారావు కళ్ళు తుడుచుకున్నాడు. అతని హృదయం తేలికయ్యింది. అభిరాం అతనికి తన కొడుకులా కనబడలేదు; తండ్రిలా కనబడ్డాడు. తను యిన్నాళ్ళూ ఎంత పెద్ద తప్పు చేసాడో అర్థమైంది.

''థాంక్యూ... అభీ... నేనేమిటో నాకు చెప్పావు. సారీ నాన్న, ఇంకెప్పుడూ పొరపాటు జరగదు. ఇప్పుడు ఏం చెయ్యమంటావో చెప్పు.''

''నువ్వే చెప్పు డాడీ...''

''ఇల్లు అమ్మను సరేనా? ప్రతీ సంవత్సరం మీ తాతయ్య పోయిన రోజున యిక్కడకు వద్దాం.''

''తర్వాత?''

ఆలోచించి చెప్పాడు రామారావు. ''ఈ ఇంటిని పెద్ద షాపింగ్ కాంప్లెక్సుగా మార్చేద్దాం. దానికి తాతయ్య పేరు పెడదాం. ఓకేనా?''

''ఊహు,'' తల అడ్డంగా వూపుతూ అన్నాడు అభిరాం.

కొంచెంసేపాగి అన్నాడు రామారావు, ''పోనీ... ఇదే యింటిని పెద్ద ఫంక్షన్ హాల్‌లా కట్టిద్దాం. దానికి తాతయ్య బామ్మల పేర్లు పెడదాం. అప్పుడు యిక్కడ ఏ ఫంక్షన్ జరిగినా, యిద్దరి పేర్లు అందరూ తలుచుకుంటారు.''

పెదవి విరిచాడు అభిరాం, ఆలోచన నచ్చలేదన్నట్టు.

''మరేం చేద్దాం నువ్వే చెప్పు?''

''ఈ యింటిని పగలగొట్టేద్దాం.''

ప్రత్యక్షంగా, పరోక్షంగా వింటూన్న రామారావు, మాధవయ్యాలిరువురూ ఉలిక్కి పడ్డారు.

''పగలగొట్టి?...''

''మళ్ళీ కడదాం.''

''ఎలా?''

''ఇలా.'' చేతిలో ఆల్బమ్ తెరచి ఫోటో చూపించాడు.

మాధవయ్య అద్భుతాన్ని చూసినట్టు చూసాడు. అప్రయత్నంగా లోపలికి వచ్చాడు సంబరంగా.

''ఇది తాతయ్యకి చాలా యిష్టమైన ఇల్లు డాడీ. మీకోసం మార్చి యీ ఇల్లు కట్టించాడు. మళ్ళీ నువ్వు అచ్చం అలాగే కట్టిస్తే, తాతయ్య ఎక్కడ వున్నా యిక్కడే వున్నట్టుంటుంది.

బయట టప టప శబ్దం.

ముగ్గురూ బయటకు వచ్చి చూసారు.

దాదాపు పది కాకులు దాకా చేరి, గోడ మీద ముద్దని తింటున్నాయి.

ఆనందంతో అన్నాడు అభిరాం, ''చూసారా డాడీ! తాతయ్య ఆశీర్వదించాడు.''

మాధవయ్య, రామారావు ఆనందాశ్చర్యాలతో చూస్తున్నారు.

రామారావుకి పూర్తిగా భారం దిగిపోయినట్టు అయ్యింది.

మాధవయ్య ఆప్యాయంగా అభిరాంని దగ్గరకు తీసుకుని అన్నాడు, ''తాతయ్య తదనంతరం ఆస్తే కాదు, తాతయ్య మనసు కూడా సంపాదించావు.''

★


## మద్యపానం మానేయడం ఎలా?

**మద్యానికి బానిసైన వ్యక్తిని తీసుకురాకుండా మరియు అతనికి చెప్పకుండా!**

| తేదీలు | (ప్రతినెల) అడ్రస్ |
|---|---|
| 7,14 & 21 | హైదరాబాద్: హోటల్ త్రీ కాస్టల్స్, కామత్ హోటల్ ఎదురుగా, నాంపల్లి స్టేషన్ రోడ్ |
| 1 మరియు 15 | విజయవాడ: హోటల్ పెక్సో, బందర్ రోడ్ |
| 2 మరియు 16 | గుంటూరు: తిలోత్తమ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 3 మరియు 17 | రాజమండ్రి: మెట్రో లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 4 మరియు 18 | కాకినాడ: శ్రీ రామప్ప లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 5 మరియు 19 | విశాఖపట్టణం: హోటల్ దాక్షాయణి, రైల్వే స్టేషన్ ఎదురుగా, చాములమదన్ జంక్షన్ |
| 1 మరియు 15 | విజయనగరం: సింహాద్రి లాడ్జ్, రైల్వే స్టేషన్ ఎదురుగా |
| 2 మరియు 16 | శ్రీకాకుళం: శ్రీ సత్యలాడ్జ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర |
| 3 మరియు 17 | భీమవరం: రాజ్‌కమల్ లాడ్జ్, పోలీస్ బొమ్మ దగ్గర |
| 4 మరియు 18 | ఏలూరు: అక్షయ లాడ్జ్, వసంత్‌మహల్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 5 మరియు 19 | మచిలీపట్నం: ఆర్.ఆర్.భవన్ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 8 మరియు 22 | నిజామాబాద్: సాయిరామ్ లాడ్జ్, గోడౌన్ రోడ్ |
| 9 మరియు 23 | హనుమకొండ: శిల్పా లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 10 మరియు 24 | సూర్యాపేట్: హోటల్ విజేత, కొత్త బస్‌స్టాండ్ ఎదురుగా |
| 11 మరియు 25 | నల్గొండ: శ్రీ అన్నపూర్ణ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 8 మరియు 22 | మహబూబ్‌నగర్: ప్రశాంత్ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 9 మరియు 23 | కర్నూలు: శ్రీ కమల లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 10 మరియు 24 | ఒంగోలు: అశోక్ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ప్రక్కన |
| 11 మరియు 25 | నెల్లూరు: హోటల్ కార్తీక్ ఇంటర్నేషనల్ లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ప్రక్కన, సర్వోదయ కాలేజి ఎదురుగా |
| 12 మరియు 26 | తిరుపతి: తిరుమల శ్రీనివాస్ లాడ్జ్, రైల్వే స్టేషన్ ఎదురుగా |
| 4 మరియు 18 | జహీరాబాద్: తిరుమల లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఎదురుగా |
| 6 మరియు 20 | అనంతపూర్: సాయిరత్నా లాడ్జ్, ఆర్‌టిసి బస్‌స్టాండ్, న్యూటౌన్ |

మా వద్ద మధుమేహం (షుగర్), ఆస్తమా, గ్యాస్, బరువు పెరగడానికి లేదా తగ్గడానికి, జాయింట్ పెయిన్స్, పైల్స్, ఫెయిర్‌నెస్ పౌడర్, లికోరియా (స్త్రీల సమస్య) మరియు పొగత్రాగడం మాన్పించుటకు కూడా మందులు లభించును

**పూజా హెల్త్ సెంటర్**